# తీరని కోరిక

శ్రీమతి జి. కమలమ్మ

ఆ రోజు యిల్లంతా సందడిగా యున్నది. రాధ బడినుండి రావటంతోటే చిట్టి తమ్ముడు, చెల్లాయి తన దగ్గరకు పరుగెత్తు కుంటూ వచ్చారు. "అక్కయ్యా పెద్దక్క వస్తుందట నాన్నా స్టేషనుకు వెళ్ళారు" అంటూ తమ్ముడు ఏదేదో చెప్పుకొని పోతున్నాడు. రాధ పుస్తకాలు పెట్టేసి అమ్మదగ్గరకు వెళ్ళింది. "అమ్మా పెద్దక్క వాండ్లు వాస్తారా?" అని ఆశగా అడిగింది. చేసిన టిఫెన్ రాధకు పెట్టూ అవునన్నది అమ్మ.

రాధ వుత్సాహముతో గబ గబా వెళ్ళి ముఖం కడుక్కొని, బొట్టు పెట్టు కొని, దువ్వెన తీసికొని జడవేయమని అమ్మదగ్గర కొచ్చింది. అమ్మ జడవేస్తుంటే రాధ రిబ్బను సరిచేస్తూ "ఈసారి అక్కయ్య నన్ను వూరికి తీసుకొని వెళ్తుందికదూ!" అని అమాయకంగా ప్రశ్నించింది. వెంకాయమ్మకు ఏమిచెప్పడానికి తోచక "చూస్తాంకాని" అని సర్దేసింది.

రాధకు అక్క, బావ వస్తారంటే చటుక్కున ఒకటి జ్ఞాపకానికి వచ్చింది. పోయిన సంవత్సరము అక్కవచ్చినప్పుడు అమ్మతో అన్నది. "రాధను నాతో మంత వూరికి తీసుకొనిపోతానని" రాధకు యిప్పుడు జ్ఞాపకానికి వచ్చింది ఆ సంగతి.

ఆ రోజు రాత్రి భోజనాలయిన తర్వాత అందరు డాబామీద చేరారు. నాన్న చదువుకోమని తొందర చేసారు. అయితే తనకు మాత్రం ఆ రోజు చదువుకోవలెనని లేదు. అక్కచెప్పేకబుర్లు వినాలనిపించింది. ఏలాగయితేనేం? నాన్న తొందర వల్ల పుస్తకాలు తీసుకొని, అందరి ముందూకూర్చున్నది. తిన్నగా యింగ్లీషు పుస్తకముతీసి ఆ రోజు టీచరు చెప్పిన పాఠము చదువుతూంది. తనకేమీ బోధ పడలేదు. మనసంతా అమ్మ అక్క సంభాషణవేపు మళ్లింది. అక్క "అమ్మా రాధను నాతోకూడ తీసుకొనిపోతాను. అది అక్కడే చదువుకొంటుంది. ఈ పల్లెటూరులో ఏంచదువుతుందని" చెప్పింది. దానికి సమాధానం వెంకాయమ్మ "ఈ సంవత్సర యిక్కడనే చదువుకొని, వచ్చే సంవత్సరం నీతోకూడ వస్తుందిలే. అది వస్తే చెల్లాయికి తమ్ముడికి ఏమితోచదు" అని రాధను విడిచివుండలేక సర్ది చెప్పింది. అక్కచేసేదేమీ లేక సరి అన్నది. రాధకు మాత్రం ఆ సమయంలో అమ్మమీద

కోపంవచ్చింది. ''అమ్మ ఎప్పుడింతే, ఎక్కడికిపోనివ్వదు. సరదాగా పోతానంటే అమ్మకు ఒప్పదు'' అని విసుక్కుంది తనలోనే. ఆ రోజు అట్లనే చాలాసేపు ఆలోచించి నిద్రపోయింది

మరల ఈ సంవత్సరం అక్క వస్తుందంటే తన సంతోషానికి మేర లేకపోయింది. రాధకు అక్కతోకూడ పట్నం వెళ్లి అక్కడి వింతలు, క్రొత్త ప్రదేశములు చూడాలనిపించింది.

వీధి గుమ్మంలోనికి వెళ్ళి చూచింది. యింకా బండిరాలేదు. తమ్ముడు చెల్లాయితో వీధి అరుగుమీద కూర్చొని ఆడుకొంటూంది. కాసేపయిన తర్వాత వున్నట్లుండి తమ్ముడు అరిచాడు, "అక్కా బండి వస్తుందని'' అందరు లేచి నిలబడ్డారు. గుమ్మం ముందర జట్కావచ్చి ఆగింది. అందులోనించి నాన్న, అక్క, బావ దిగారు. రాధ కండ్లు సంతోషముతో చెమ్మగిల్లాయి. వాండ్లతోకూడ ముగ్గురు యింట్లోకి వెళ్లారు. ఆ రోజు కబుర్లతో సంతోషముగా గడచిపోయింది.

ప్రతిసారి అక్క వచ్చినప్పుడు ఆమె వూరికి వెళ్తానంటే, యింకా రెండు రోజులు వుండిపోతే బాగుండుననిపించేది. ఈ సారి రాధను తనతోకూడ తీసుకొని పోతానన్నది కాబట్టి అక్కకూడ తొందరగా వెళ్తే బాగుండుననిపించింది రాధకు. నాన్న అంటూన్నాడు బావతో ''పది రోజులు వుండిపొమ్మని'' ఈ సారి ''తొందరగా వెళ్ళిపోవలె మామయ్యా! శెలవు లేదని'' అంటున్నాడు బావ. ఈ సమాధానం సంతోషమయింది రాధకు.

అక్క ప్రయాణం దగ్గరపడింది. రేపే అక్క, బావ వూరికిపోవలెనని అన్నీ సర్దుకొంటూన్నారు. ఈ మాటు అక్క, బావ తను రాత్రి అందరుపడుకొని నిద్రపోతున్నారు. కాని తనకుమాత్రం నిద్రపట్టలేదు.

తాను రైలుఎక్కి ఎన్ని సంవత్సరములు అయింది! తనకు మూడేళ్లప్పుడు బాబాయి కొడుకు పెండ్లికి తీసుకొని వెళ్లినట్లు అమ్మ ఎవరితోనో చెప్తూంటే విన్నది, అదే రాధ రైలు ఎక్కడం అంతే.

ఇప్పుడు అక్కతోకూడ వెళ్తేటప్పుడు రైలు పెట్టెలో కిటికీతట్టు కూర్చుంటే పచ్చనిపైరులు, చెరువులు, యిసుకబయళ్లు, రాతిగుట్టలు చూస్తుండవచ్చును.

హాయిగా రెండురోజులు ప్రయాణం. ఈ మాదిరి రాధ వూహా ప్రపంచములో వుండగా ఎప్పుడో కునుకు పట్టింది.

తెల్లవారింది రైలుకు అంతా రెడీగా వున్నారు. రాధకు తాను అడుగుదామని

పించింది. అయితే అడగడానికి సిగ్గు పడింది. జట్కావాకిట్లో నిలిచింది. పెట్టె బెడ్డింగు తీసుకొచ్చి కూలివాడు బండిలో పెట్టాడు. బావ అందరితో వస్తానంటూ బండి ఎక్కాడు. అక్క కూడ వస్తానంటూ అమ్మదగ్గరకొచ్చి "అమ్మా ఈ సారి రాధను తీసుకొనిపోవ డానికి వసతిలేదు. ఈ మారు వచ్చి నప్పుడు తీసుకొని వెళ్తా"నంది. రాధ దగ్గ రకువచ్చి ఒక రూపాయ చేతిలోపెట్టా "బాగా చదువుతూండు రాధా!" అనిచెప్పి బండిలో ఎక్కింది. రాధ దిగాలుపడిన ముఖముతో జట్కాపోయినవైపే చూస్తా నిలబడిపోయింది. తన కోరిక నెరవేర నందులకు ఆ రోజు అంతా తనకేమీ తోచలేదు.

---

# అనసూయ

శ్రీ కన్నెకంటి వీరభద్రాచార్యులు

ఓ యఖండ కళా స్వరూపిణి
ఓ యమేయ దయా సుధారస
దాయినీ! నీవెవర వమ్మా
ధర్మ దేవతవు –

మాయ నంటని బాలదత్తా
త్రేయు లమ్మా! యనుచుఁ బిల్వఁగ
హాయిఁ జెందుచు నుంటి నీవన
సూయవా! జనని!

గోవులును పులు లొక్క రేవునఁ
గ్రోలు చున్నవి సలిల ధారల
పావనీ! నీ మధుర మధుర త
పః ప్రభావమున —

నిక్క తిరిగెడి దేవకాంతల
చక్క దిద్దుట కొరకు నారదుఁ
డుక్కు సెనగల నీయ గుగ్గి
ళ్లుడకఁ జేసితి వా!

పాల పాపలఁ జేసికొని ఆ
బ్రహ్మ విష్ణ్వీశ్వరులనే ఊ
యాల నూపుచు తీయతీయని
జోల బాడితివా!

కల్లలను కపటల నెఱుఁగని
తల్లి వనికొని ముగురు మూర్తులు
పిల్లలై నీ హృదయ సీమల
పెరుగఁ దలఁచిరిగా!

గాలుఁగదలఁగ నీక – సప్తా
శ్వాల రథమును నిలుపు దీక్షా
శీల – సుమతీదేవి నీ ప్రియ
శిష్యురాలుగదా!

భారత స్త్రీ సహజ శీల, మ
పారమవ్యయ మచలమని, బం
గారు తల్లీ! చాటితివి జో
హారులను గొనుమ!

---